
భక్తిశ్రద్ధలతో బక్రీద్



ఈద్ ముబారక్ చెప్పుకొంటున్న ముస్లింలు



రిజర్వ్‌లైన్ మసీదులో ప్రార్థనల్లో పాల్గొన్న ముస్లింలు



వైఎస్సార్ పార్క్ సమీపంలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

అల్లిపురం: త్యాగానికి ప్రతీకగా నిలిచే బక్రీద్ పండగను ముస్లింలు గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మసీదుల్లో, ఈద్గాల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. నియోజకవర్గంలోని అల్లిపురం, చలువతోటలోని మసీదు వద్ద, రిజర్వ్‌లైన్ మసీదు, కోటవీధి మసీదు, జగదాంబ దరి మక్కా మసీదు, వైఎస్సార్ పార్క్ సమీపంలో, ఏవీఎస్ కళాశాలలోని మసీదు వద్ద ప్రార్థనలు చేశారు. త్యాగం, ప్రేమ, సహనం వంటి సద్గుణాల సందేశమే బక్రీద్ అని ప్రవక్తలు పేర్కొన్నారు. ముస్లింలంతా తమ పెద్దల సమాధుల వద్ద ఇష్టమైన ఆహార పదార్థాలు, పుష్పాలు ఉంచి ప్రార్థనలు చేశారు. ఒకరికి ఒకరు ఈద్ ముబారక్ తెలియజేసుకున్నారు.

చందన అలంకరణలో శ్రీనివాసుడు



చందన అలంకరణలో బల్లిగిరి ప్రసన్న వేంకటేశ్వర స్వామి



ఆలయ మండపంలో విష్ణు సహస్ర నామాలు పారాయణ చేస్తున్న భక్తులు

- భక్తిశ్రద్ధలతో తొలి ఏకాదశి పూజలు
- బల్లిగిరికి పోటెత్తిన భక్తులు

అల్లిపురం: తొలి ఏకాదశి పర్వదినాన బల్లిగిరి శ్రీ ప్రసన్న వేంకటేశ్వరాలయంలో స్వామి చందన అలంకరణలో నేత్రపర్వంగా దర్శనమిచ్చారు. స్వామిని దర్శించుకునేందుకు వేకువ జాము నుంచే భక్తులు ఆలయం వద్ద బారులు తీరారు. ఆలయ అర్చకుడు గొడవర్తి రాఘవాచార్యులు స్వామిని చందనంతో విశేషంగా అలంకరించి, భక్తులకు దర్శనాలు కల్పించారు. ఆలయ మండపంలో శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలను ఏర్పాటు చేసి భక్తుల గోత్రనామాలతో పూజలు చేశారు. భక్తులు స్వామికి పండ్లు, పుష్పాలు, పిండి పదార్థాలు నివేదించారు. విష్ణు సహస్ర నామ పారాయణం చేశారు. సాయంత్రం దేవస్థానం ఆవరణలోని ధ్వజ స్తంభం వద్ద మహిళలు ప్రత్యేకంగా దీపాలంకరణ చేశారు.

క్లుప్తంగా

రోగికి మెడికల్ షూ అందజేత



ఎర్రయ్యకు షూ అందిస్తున్న కోడిగుడ్ల శ్రీధర్

కంచరపాలెం: జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురం బాబుకాలనీకి చెందిన పూతి ఎర్రయ్య మధుమేహంతో బాధపడడంతో రెండు కాళ్ల దెబ్బతిని నడవలేని స్థితికి చేరుకున్నాడు. ఈ విషయాన్ని వలంటీర్ కుమార్ ద్వారా తెలుసుకున్న కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ స్పందించారు. ఈ మేరకు ఆమె సూచనతో గురువారం వైఎస్సార్‌సీపీ వార్డు సీనియర్ నాయకుడు కోడిగుడ్ల శ్రీధర్ రోగి ఎర్రయ్య కాళ్లకు లెదర్ (మెడికల్) షూ తొడిగారు. మందుల ఖర్చుకు రూ. 3 వేలు అందజేశారు. నాయకులు వేలంగిని రావు, శ్యామ్‌సుందర్ తదితరులు పాల్గొన్నారు.

రేణుక యల్లమ్మ ఆలయంలో అన్నదానం

అల్లిపురం: కెప్టెన్ రామారావు జంక్షన్‌లో గల రేణుక యల్లమ్మ అమ్మవారి ఆలయంలో తొలి ఏకాదశి సందర్భంగా గురువారం అన్నదానం ఏర్పాటు చేశారు. ఆలయ అధ్యక్షుడు కర్రి నీలకంఠం, ఆయన తల్లిదండ్రులు కర్రి రాము, సముద్రం, కుమార్తె ఆరాధ్య ఆర్థిక సహకారం అందించారు. ముందుగా అమ్మవారికి పూజలు నిర్వహించారు. అనంతరం వృద్ధ మహిళలకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షుడు పీల వెంకట అప్పలనాయుడు, సలహాదారు బొడ్డేటి ప్రసాద్, ఉపాధ్యక్షుడు పంపాన గణేష్, కోశాధికారి వాసుపల్లి నారాయణ, సత్యనారాయణ, బడే నాగరాజు పాల్గొన్నారు.

రోడ్డెక్కిన మురుగు



ద్వారకానగర్ ఫోర్త్ లైన్ రోడ్డులో లీకైన యూజీడీ మ్యాన్‌హోల్

సీతమ్మధార: జీవీఎంసీ 27వ వార్డు ద్వారకానగర్ ఫోర్త్ లైన్‌లోని సీబీఎం కాంపౌండ్ రహదారిలో యూజీడీ మ్యాన్‌హోల్ లీకైంది. దానిలోని మురుగు నీరంతా రోడ్డెక్కి ప్రవహించడంతో స్థానికులు, పాదచారులు ఇబ్బందులు పడుతూ రాకపోకలు సాగించారు. ఈ ప్రాంతంలో వారానికి ఒక సారి ఈ సమస్య తలెత్తుతున్నా.. పట్టించుకునే నాథుడే కరువయ్యాడని పలువురు మండిపడుతున్నారు. రోడ్డుపై మురుగు నీటి ప్రవాహంతో దుర్వాసన భరించలేకపోతున్నామని వాపోతున్నారు. జీవీఎంసీ యూజీడీ విభాగం అధికారులు తక్షణం పరిశీలించి తగు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

బాబోయ్ దుర్వాసన..!



టింపనీ స్కూల్ వద్ద చెత్తతో నిండిన డస్ట్‌బిన్, పరిసరాలు

సీతమ్మధార: జీవీఎంసీ 27వ వార్డులోని టింపనీ స్కూల్ ప్రాంతంలో చెత్తాచెదారం పేరుకుపోవడంతో దుర్వాసన వెలువడుతోంది. ఆ మార్గంలో ముక్కు మూసుకుని రాకపోకలు సాగించాల్సి వస్తోందని స్థానికులు, పాదచారులు వాపోతున్నారు. మూడు రోజులుగా చెత్తను డస్ట్‌బిన్‌లో వేయకుండా దాని పక్కన పడేస్తున్నారు. వాటిని పశువులు, కుక్కలు రోడ్డంతా చెల్లాచెదురు చేస్తున్నాయి. దీంతో స్కూల్ పిల్లలు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. పారిశుధ్య అధికారులు స్పందించి సకాలంలో చెత్త తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

చిత్తశుద్ధితో పనిచేయండి

డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు

మహారాణిపేట: రోగులకు చిత్తశుద్ధితో సేవలందించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి(డీఎంహెచ్‌వో) డాక్టర్ పి. జగదీశ్వరరావు సూచించారు. పెందుర్తి మండల పరిధిలోని సరిపల్లి విలేజ్ హెల్త్ క్లినిక్, కుటుంబ డాక్టర్ విధానాన్ని గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన పీహెచ్‌సీ వైద్యులు,ఇతర ఆరోగ్య సిబ్బందితో సమీక్షించారు. ఏఎన్ఎం,ఆశ కార్యకర్తలు తమ పరిధిలోని హైరిస్క్ గర్భిణులను గుర్తించి వారిని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి పంపించాలని సూచించారు. వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించారు. గర్భిణులు,వ్యాధి నిరోధక టీకాలకు వచ్చే వారి వివరాలు యాప్‌లో అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. కుటుంబ డాక్టర్ విధానంలో భాగంగా సరిపల్లి హెల్త్ క్లినిక్‌ను సందర్శించి గ్రామ ప్రజలతో మాట్లాడారు. వైద్య సేవలపై ఆరా తీశారు.



రోగులతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

పాతనగరంలో బంగారం వర్తకుల ధర్నా

అల్లిపురం: రోడ్డు విస్తరణలో భాగంగా షాపుల తొలగింపులో టీడీర్ వద్దు... కాంపన్‌సేషన్ ముద్దు అంటూ కొత్తరోడ్డులో బంగారు షాపుల దుకాణదారులు గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బంగారం షాపుల ప్రతినిధులు మారోజు శ్రీనివాస్ తదితరులు మాట్లాడుతూ 2013 ల్యాండ్ అక్విజేషన్ ఆక్ట్ - 2013 ప్రకారం కాంపన్‌సేషన్ చెల్లించాలని కోరారు. కాంపన్‌సేషన్ ఇవ్వకుండా ఫుట్ పాత్‌లు తొలగించడమే కాకుండా షాపుల సైన్ బోర్డులు తొలగించడం అన్యాయమని వాపోయారు. విశాఖ నగరం అభివృద్ధికి మా వంతు సహకారం ఉంటుందని స్పష్టం చేశారు.

జేసీఎస్ ఇన్‌ఛార్జులు వీరే

అల్లిపురం: దక్షిణ నియోజకవర్గం జేసీఎస్ ఇన్‌ఛార్జులను వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం గురువారం ప్రకటించింది. నియోజకవర్గంలో 27, 31, 32, 42 వార్డులకు జేసీఎస్ ఇన్‌ఛార్జిగా దొడ్డి రామానంద్, 33, 34, 35, 41 వార్డులకు కర్రి నీలకంఠం, 36, 38, 39 వార్డులకు కొల్లి సింహాచలం, 28, 29, 30, 37 వార్డులకు పీతల శ్రీనివాస్‌ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

'అగనంపూడి టోల్‌గేటు తరలించాలి'

అగనంపూడి: అనకాపల్లి-సబ్బవరం మధ్య టోల్‌గేటు ఏర్పాటు చేసిన తరువాత కూడా అగనంపూడి టోల్‌గేటు కొనసాగించడం అన్యాయమని రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ జి.పూర్ణానందశర్మ అన్నారు. వెంటనే టోల్ గేట్‌ను ఇక్కడి నుంచి తరలించాలని డిమాండ్ చేశారు. అగనంపూడిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఐదేళ్ల క్రితం హైకోర్టు ఆదేశాల మేరకు టోల్ ఫీజు ఉపసంహరించుకున్నారని, తరువాత హైవే అధికారులు, కాంట్రాక్టర్ సుప్రీంకోర్టును ఆశ్రయించే సమయంలో అనకాపల్లి వద్ద టోల్‌గేటు ఏర్పాటు చేసిన తరువాత అగనంపూడి టోల్‌ప్లాజాను మూసివేస్తామని న్యాయస్థానానికి రాతపూర్వకంగా హామీ ఇచ్చారని పేర్కొన్నారు. రెండున్నర దశాబ్దాల క్రితం రహదారి విస్తరించే సమయంలో రుణంగా తీసుకున్న మొత్తం తిరిగి రాబట్టిన తరువాత కూడా అడ్డగోలుగా దోపిడీ చేయడం తగదన్నారు. బీజేపీ నాయకులు ఒత్తిడి తీసుకువచ్చి టోల్‌గేటును మూసివేయించాలని కోరారు.

సిరులతల్లికి ఘనంగా సహస్ర తులసీపూజ

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనక మహాలక్ష్మికి గురువారం సహస్ర తులసీపూజ ఘనంగా నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి కె.శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ధర్మకర్తలు సత్యరూపవాణి, ఎం.ధనలత, సతీష్, ఎస్ఎస్ఎస్ సుబ్రహ్మణ్యం, ఆలయ సహాయ కార్యనిర్వహణాధికారి తిరుమలేశ్వరరావు పాల్గొన్నారు.

నేడు క్షీరాభిషేక సేవ

కనక మహాలక్ష్మికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించనున్నారు. ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.500 చెల్లిస్తే ఇద్దరిని అనుమతించనున్నారు. పూజలో పాల్గొనదలచే భక్తులు 0891 2566514, 2711725 లో సంప్రదించాలి.



సహస్ర తులసి పూజలో సిరులతల్లి

పబ్లిక్ డిమాండ్

చెత్త తొలగించండి

కంచరపాలెం: జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురం పరిధి బాబుకాలనీ రహదారి ఎర్రిగెడ్డ సమీపంలో చెత్త తొలగించకపోవడంతో పాదచారులు, ద్విచక్ర వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. పారిశుధ్య కార్మికులు ఇటీవల గెడ్డల్లో పూడికలు తొలగించి రహదారులపై వేసి వదిలేశారు. వర్షాలు కురుస్తున్న సమయాల్లో ఆ చెత్త మళ్లీ గెడ్డల్లోకే చేరుతోంది. తీసిన పూడిక తరలించాలని పారిశుధ్య సిబ్బందికి ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా సంబంధిత పబ్లిక్ హెల్త్ అధికారులు స్పందించి సమస్య పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలి.

– గవర రమణ, బాబుకాలనీ, జ్ఞానాపురం



బాబుకాలనీ ఎర్రిగెడ్డ సమీపంలో పూడిక

భవన యజమానుల అంగీకారంతోనే విస్తరణ పనులు

- జోన్ – 4 కమిషనర్ శివప్రసాద్

అల్లిపురం: మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ పరిధిలో జగదాంబ కూడలి నుంచి పాత పోస్టాఫీసు వరకు జరుగుతున్న రోడ్డు విస్తరణ పనులు భవన యజమానుల అంగీకారంతోనే నిర్వహిస్తున్నట్లు జోన్ – 4 జోనల్ కమిషనర్ శివప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. 2018లో ప్రజల అభిప్రాయాన్ని సేకరించి విస్తరణను 100 అడుగుల రహదారి నుంచి 60 అడుగులకు కుదించారన్నారు. రహదారి విస్తరణ కోసం సుమారు 200 మంది అనుమతి తెలుపుతూ అంగీకారపత్రం అందజేశారన్నారు. ఈ క్రమంలో కొంత మంది స్థల యజమానులకు నష్టపరిహారం, టీడీఆర్‌లను ఇదివరకే జారీ చేశామన్నారు. ప్రస్తుతం 2.4 కిలోమీటర్ల రహదారి విస్తరణ జరుగుతుందని తెలిపారు. రోడ్ డెవలప్‌మెంట్ ప్లాన్ మంజూరయిందన్నారు. సుమారు 442 ఆస్తులు రహదారి విస్తరణలో ఉన్నాయన్నారు. వాటిలో 26 భవనాలు రోడ్డు విస్తరణకు ఆటంకం కలగలేదన్నారు. 40 భవనాల యజమానులు గతంలో అనుమతి తెలిపారన్నారు. 2018లో సుమారు 22 టీడీఆర్‌లు జారీ చేశామన్నారు. 3 టీడీఆర్‌లు ప్రస్తుతం జారీ చేశామని, 77 టీడీఆర్‌లు కమిషనర్ అనుమతి పొందాయని తెలిపారు. దేవదాయశాఖ దుకాణాలు తొలగింపు ప్రక్రియ జరుగుతుందన్నారు. 60 అడుగుల రోడ్డును ఆక్రమించి ఏర్పాటు చేసిన, జీవీఎంసీ ఇదివరకే టీడీఆర్‌లు ఇచ్చిన భవనాలను తొలగించామని తెలిపారు. రహదారి విస్తరణకు సహకరించిన పేకేటి నారాయణరావు, పేకేటి కామేశ్వరరావు టీడీఆర్ బాండ్లను కమిషనర్ ఆమోదించినందున స్థల యజమానులకు అందించామని తెలిపారు.

ట్రిపుల్ ఆర్ సెంటర్లతో పర్యావరణానికి మేలు

- జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ

అల్లిపురం : అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణకు రెడ్యూస్, రీయూజ్, రీ సైకిల్ సెంటర్లు (ట్రిపుల్ ఆర్) ఎంతో ఉపయోగపడతాయని జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయికాంత్ వర్మ అన్నారు. గురువారం ఆయన ఎండాడ, తగరపువలస, గాజువాక, పెందుర్తి ప్రాంతాల్లో గల ట్రిపుల్ ఆర్ సెంటర్లను సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ట్రిపుల్ ఆర్ సెంటర్ల ఉపయోగాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణకు, వ్యర్థాల నిర్వహణకు, స్థిరమైన అభివృద్ధికి ఈ కేంద్రాలు బాటలు వేస్తాయని పేర్కొన్నారు. వ్యర్థ పదార్థాల్లో అనేక రకాల గాజు, కాగితం, మెటల్, ప్లాస్టిక్, టైర్లు, దుస్తులు, పుస్తకాలు, బ్యాటరీలు, ఎలక్ట్రానిక్స్ ఉపకరణాలను ట్రిపుల్ ఆర్ సెంటర్ల ద్వారా సేకరించి రీసైక్లింగ్ చేసి ఆట వస్తువులతోపాటు ఇతర వస్తువులు తయారు చేయవచ్చన్నారు. అనంతరం తగరపువలస, సబ్బివానిపాలెంలోని బుక్ కేఫ్‌ను సందర్శించి పౌరులకు మంచి విజ్ఞానాన్ని అందించే పుస్తకాలు అందుబాటులో ఉంచాలని సూచించారు. ఆయనతోపాటు జీవీఎంసీ అదనపు కమిషనర్ డాక్టర్ వి.సన్యాసిరావు, ప్రధాన వైద్యాధికారి నరేష్‌కుమార్, పర్యవేక్షక ఇంజినీర్లు శ్యాంసన్ రాజు, సత్యనారాయణరాజు, జోనల్ కమిషనర్ కనక మహాలక్ష్మి, ఏఎంహెచ్‌వో కిషోర్ ఉన్నారు.



ట్రిపుల్ ఆర్ సెంటర్‌లో పరిశీలిస్తున్న జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ తదితరులు

జగన్నాథుడిని దర్శించుకున్న ఎమ్మెల్యే వాసుపల్లి

అల్లిపురం: జగన్నాథస్వామి రథయాత్రలో భాగంగా టర్నల్ చౌల్ట్రీలో శేషపాన్పుపై కొలువుదీరిన స్వామిని ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ గురువారం దర్శించుకున్నారు. స్వామికి ఫలాలు, పుష్పాలు సమర్పించారు. వేదపండితులు స్వామి వారి ఆశీర్వచనాలు అందజేసి ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాటు ఆలయ కార్యనిర్వహణాధికారి రాజగోపాలరెడ్డి, మారోజు శ్రీనివాస్, కంటుముచ్చు సాగర్, కిషోర్, వడ్డాది దిలీప్ తదితరులు పాల్గొన్నారు.



జగన్నాథుడికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్

'ఉక్కు' సంకల్పానికి కేంద్రం తలవంచాల్సిందే..



868వ రోజు ఉక్కు దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: ఉక్కు సంకల్పంతో నిర్విరామంగా కొనసాగుతున్న స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ ఉద్యమానికి కేంద్ర ప్రభుత్వం తలవంచక తప్పదని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలి వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షలు గురువారం నాటికి 868వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలో సంస్థకు చెందిన పలు విభాగాల కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ విశాఖ ఉక్కు కర్మాగారం అమ్మాలనే ఆలోచన వచ్చిన మోదీ ప్రభుత్వానికి ప్రజలు గట్టిగా బుద్ధి చెప్తారన్నారు. ఎందరో కార్మికుల బలిదానాలతో సాధించుకున్న విశాఖ ఉక్కును ప్రైవేట్ వ్యక్తులకు అప్పజెప్పడం దుర్మార్గమన్నారు. వెంటనే స్టీల్‌ప్లాంట్ ప్రభుత్వ రంగంలోనే కొనసాగుతుందనే ప్రకటనను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటాలను ఉధృతం చేసేందుకు భవిష్యత్తు ప్రణాళికను సిద్ధం చేస్తున్నామన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం తన నిరంకుశత్వ నిర్ణయాన్ని వీడి ప్రైవేటీకరణను ఆపాలని కోరారు. కార్యక్రమంలో ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

ఆజాద్‌పై కాల్పులు జరిపిన దోషులను శిక్షించాలి

సీతమ్మధార : భీమ్ ఆర్మీ చీఫ్ చంద్రశేఖర్ ఆజాద్‌పై కాల్పులు జరిపిన దోషులను కఠినంగా శిక్షించాలని జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద పౌర, ప్రజా సంఘాల నాయకులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఉత్తరప్రదేశ్‌లో దళితులకు అండగా ఉంటున్న ఆజాద్‌పై ఈ నెల 28న మతోన్మాద శక్తులు కాల్పులు జరిపాయని, ఈ ఘటనకు కారణమైన వ్యక్తులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే నిజాన్ని చెప్పే గొంతును నిర్బంధించేందుకు జర్నలిస్టు తులసీ చందుపై ఆర్‌ఎస్ఎస్, బీజేపీ మూకలు దుర్మార్గమైన ట్రోలింగ్ చేస్తున్నాయని, చివరకు ప్రాణాలు తీస్తామని బెదిరించే స్థాయికి తెగబడ్డాయన్నారు. తులసి చందును కాపాడేందుకు అందరం అండగా నిలవాలని కోరారు. ప్రశ్నించే గొంతుల్ని అణిచి వేయడానికి ఉపా కేసుల్ని బనాయిస్తున్నారని దుయ్యబట్టారు. మార్క్స్ అధ్యయన కేంద్రం కన్వీనర్ జేవీ సత్యనారాయణమూర్తి, ఎం.వెంకటేశ్వర్లు, పీవోడబ్ల్యూ రాష్ట్ర కార్యదర్శి ఎం.లక్ష్మి, ఏపీ మహిళా సమాఖ్య రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షురాలు ఎ.విమల, అరసం ప్రతినిధి ఎం.క్షేత్రపాల్‌రెడ్డి, అరుణోదయ, సాంస్కృతిక సమాఖ్య జిల్లా కార్యదర్శి ఎ.నిర్మల, ఎం.వెంకటలక్ష్మి, నాగభూషణం, నల్లయ్య, కాసు బాబు, డి.లలిత, మధు పాల్గొన్నారు.



జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న పౌర, ప్రజా సంఘాల నాయకులు

పాపాహోం విద్యార్థులకు పుస్తకాల పంపిణీ



పంపిణీ చేసిన పుస్తకాలతో పాపాహోం విద్యార్థులు

అల్లిపురం: పోలీస్ బ్యారెక్స్‌లోని పాపాహోంలో ఆశ్రయం పొందుతున్న చిన్నారులకు వైఎస్సార్‌సీపీ నాయకుడు సీతంరాజు సుధాకర్ సహకారంతో పుస్తకాలు పంపిణీ చేశారు. 31వ వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు బత్తిన నాగరాజు, ఇన్‌చార్జి బత్తిన నవీన్‌కుమార్ ఆధ్వర్యంలో గురువారం జరిగిన కార్యక్రమంలో విద్యార్థులకు పుస్తకాల పంపిణీతో పాటు అల్పాహారం అందజేశారు. కార్యక్రమంలో వార్డు నాయకులు, కార్యకర్తలు శంకర్రావు, త్రిమూర్తులు, రాజేష్, జితేంద్ర, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

సింహగిరిపై మొక్కల పంపిణీ



మొక్కలతో ప్రధానార్చకుడు, ట్రస్ట్‌బోర్డు సభ్యులు



భక్తులకు మొక్కలు అందజేస్తున్న సభ్యులు

సింహాచలం: తొలి ఏకాదశి పురస్కరించుకుని గురువారం సింహగిరిపై స్వధర్మ వాహిని ఆధ్వర్యంలో భక్తులకు మొక్కలు పంపిణీ చేశారు. గాజువాకకు చెందిన భక్తులు కాశీ కృష్ణ, కంచి శేషగిరిరావు కడియం నుంచి తీసుకొచ్చిన వెయ్యి మొక్కలు అందజేశారు. ఆ మొక్కలకు ఆలయ ప్రధానార్చకుడు ఇరగవరపు రమణాచార్యులు, అర్చకులు కల్యాణ మండపంలో పూజలు చేశారు. అనంతరం రాజగోపురం వద్ద ఉన్న కళావేదిక వద్ద దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యులు, అధికారులు భక్తులకు మొక్కలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యులు సంపంగి శ్రీనివాసరావు, వారణాసి దినేష్‌రాజ్, సువ్వాడ శ్రీదేవి, ముదుండి రాజేశ్వరి, ఆలయ ఏఈవో భ్రమరాంబ, సూపరింటెండెంట్ పాలూరి నరసింగరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కళావేదికపై అన్నమయ్య సేవా ట్రస్ట్ నిర్వాహకురాలు సునీత ఆధ్వర్యంలో సామూహిక విష్ణుసహస్రనామ పారాయణ చేపట్టారు.

గిరిప్రదక్షిణలో బాలలకు సౌకర్యాలు కల్పించండి

సింహాచలం: గిరిప్రదక్షిణతో పాటు ఆలయ ప్రదక్షిణ సమయంలో బాలలకు అన్ని సదుపాయాలు కల్పించాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారామ్, కుమారి ఆదిలక్ష్మి సింహాచలం దేవస్థానం అధికారులకు సూచించారు. సింహగిరిపై గురువారం బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సారథ్యంలో దేవస్థానం అధికారులు, స్త్రీ,శిశు సంక్షేమశాఖ, కార్మికశాఖ, జిల్లా బాలల సంరక్షణ విభాగం, 1098 చైల్డ్‌లైన్, వార్డు సచివాలయాల కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. సీతారాం, ఆదిలక్ష్మి వచ్చే నెల 2న జరగనున్న గిరిప్రదక్షిణకు సంబంధించి దేవస్థానం అధికారులు చేస్తున్న ఏర్పాట్లను అడిగి తెలుసుకున్నారు. దారి పొడవునా పిల్లలకు వేడి పాలు, బిస్కెట్లు అందించాలే క్యాంపులు ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో దేవదాయశాఖ డీసీ సుజాత, సింహాచలం దేవస్థానం ఈఈ శ్రీనివాసరాజు, ఏఈవోలు జంగం శ్రీనివాస్, భ్రమరాంబ, రమేష్ బాబు, నరసింహరాజు, ఐసీడీఎస్ ప్రాజెక్ట్‌డైరెక్టర్ డి.వెంకటేశ్వరి, కార్మికశాఖాధికారి ఎస్.విజయశ్రీ, సీడీపీవోలు ఎం.వి.రమణకుమార్తి, డి.నీలవేణి పాల్గొన్నారు.



సింహగిరిపై సమీక్ష నిర్వహిస్తున్న సీతారామ్ తదితరులు

ఘనంగా అప్పన్న నిత్య కల్యాణం



జీలకర్రబెల్లం ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: సింహగిరిపై శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో గురువారం శయన ఏకాదశి పూజలు(తొలి ఏకాదశి) పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అలాగే స్వామికి ఉదయం 9.30 గంటల నుంచి ఆలయ కల్యాణ మండపంలో నిత్యకల్యాణం ఘనంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేదికపై అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం ఘనంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు.